క్లుప్తంగా

భారీ అన్నసమారాధన



భోజనాలు వడ్డిస్తున్న సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ కిశోర్‌వర్మ, పోలీసులు

కొయ్యూరు: ప్రతీ ఒక్కరు భక్తి భావం కలిగి ఉండాలని సీఐ వెంకటరమణ కోరారు. కార్తీక గురువారం సందర్భంగా సింగవరం సాయి బాబా ఆలయంలో పోలీసులు అన్నసమ రాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐ వెంకటరమణ పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్టు పోలీసు సిబ్బంది తెలిపారు. ఎస్‌ఐ కిషోర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సుబ్బారావు

ఎటపాక: మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సుబ్బారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రాబిన్‌సుదర్శన్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 2682 ఎకరాల్లో వరి సాగు అవుతుందన్నారు. దళారులకు ధాన్యం విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్ముకుని లబ్ధిపొందాలని సూచించారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి



ఎస్‌ఐ గోపాల్‌రావు

అరకులోయ రూరల్: గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు అందరూ సహకరించాలని అరకులోయ ఎస్‌ఐ గోపాల్‌రావు కోరారు. ఆయన గురువారం విలేకరుల మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌కు గిరిజన యువత దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రత్యేక చొరవతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు చైతన్యం పరుస్తున్నామన్నారు. సమాజ మార్పునకు అందరూ కృషి చేయాలని కోరారు. ఇప్పటికే గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించి గంజాయి, డ్రగ్స్, మద్యపానం, చెడు వ్యసనాలకు గిరిజన యువతదూరంగా ఉండే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి సాగు లేకుండా గ్రామాల్లో ప్రత్యేక పర్యవేక్షణ, రవాణా జరగకుండా ఎక్కడికక్కడ ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ బోయిన కుమారి, నాయకులు

గూడెంకొత్తవీధి: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని పెదవలస పంచాయతీ రంపుల గ్రామంలో డ్రైనేజీ పనులకు ఎంపీపీ బోయినకుమారి గురువారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కృష్ణవంశీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు బొబ్బిలి లక్ష్మణ్, గిరిప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు పోతురాజు కృష్ణ, కుమారి , జేఈ జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం నేడు


గంగవరం: మండలంలోని మోహనాపురంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆంధ్ర వనవాసీ కళ్యాణాశ్రమ్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు బొగ్గుల కాటంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా నిర్వహిస్తామన్నారు. గుండె, క్యాన్సర్ వంటి జబ్బులకు విశాఖపట్నం తీసుకెళ్లి ఉచితంగా వైద్యం చేయిస్తామన్నారు. సమీప గ్రామస్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

దారుణ దారులు

- రాళ్లు తేలిన రోడ్లతో ఇక్కట్లు
- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న రహదారులు
- ప్రమాదాల బారిన వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు



రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట గ్రామ రహదారి దుస్థితి



చిత్తడిగా మారిన బడదనాంపల్లి - బొర్రంపేట రహదారి

రాజవొమ్మంగి: మండలంలోని శివారు గ్రామాల్లోని రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మండలంలోని పలు గ్రామాల్లో రహదారులకు నిధులు మంజూరు చేసింది. అయితే ఎన్నికలు సమీపించడంలో కోడ్‌కారణంగా పనులు నిలిచిపోయాయి. అయితే కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అయిదు నెలలు పైబడినా నేటి వరకు ఏజెన్సీ వ్యాప్తంగా ఒక్క అభివృద్ధి పని చేపట్టిన దాఖలాలు లేవు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆయా నిధులతో గ్రామాల్లో రోడ్లు, తాగునీరు వంటి పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏళ్ల తరబడి అసంపూర్తిగా రహదారి

మండల కేంద్రం రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట వరకు గల రెండు కిలో మీటర్ల రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఏ మాత్రం వర్షం వచ్చినా ఈ మట్టి రహదారి చిత్తడిగా మారి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఎదురవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారికి దాదాపు 20 సంవత్సరాల క్రితం రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు మంజూరు కాగా అప్పట్లో సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులు ఒక కిలోమీటరు మాత్రమే నిర్మించారు. ప్రస్తుతం ఆ కిలోమీటరు బీటీ రోడ్డు కూడా ఛిద్రమైపోవడంతో యథావిధిగా రెండు కిలోమీటర్ల రోడ్డు గోతులుగా మారింది. కనీసం కాలినడకన కూడా వెళ్లేందుకు కూడా వీలులేని దుస్థితిలో పడింది. ఏ మాత్రం వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరి ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారికి వాలుగా గల కొండవాగుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 25లక్షలతో వంతెన నిర్మించడంతో కొంతవరకు రహదారి రవాణా ఇబ్బందులు తగ్గాయి. అయితే ఈ అధ్వాన రహదారి బాగుచేసేందుకు అధికారుల నిర్లక్ష్యం ఈ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీలకు శాపంగా మారింది.

అందని 108 సేవలు

మండలంలోని అప్పలరాజుపేట మాదిరిగానే మరి కొన్ని లోతట్టు గ్రామాలకు రహదారి, రవాణా సదుపాయాలు లేక ఆదివాసీలు (కొండరెడ్లు) నానా అవస్థలు పడుతున్నారు. నేటికి కనీసం 108 వాహనం కూడా వెళ్లలేని గ్రామాలు ఉన్నాయి. మండలంలోని చికిలింత నుంచి పెద గర్రంగి గ్రామం వరకు రహదారి సదుపాయం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్గానగర్ నుంచి మద్దిబందల వరకు రహదారి రాళ్లు తేలి అధ్వానంగా ఉందని ప్రయాణానికి నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాలకు అత్యవసర సమయాల్లో 108 వాహనం వెళ్లలేని పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. బడదనాంపల్లి పంచాయతీలోని బడదనాంపల్లి నుంచి లక్కవరప్పాడు మీదుగా రాజుపేట, అక్కడ నుంచి పాత బొర్రంపేట, అనకాపల్లి జిల్లాలోని మరి కొన్ని గ్రామాలకు వెళ్లేందుకు ఆయా గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నాతవరం, నర్సీపట్నం తదతర గ్రామాలకు వెళ్లేందుకు గత్యంతరం లేక గోతులతో నిండి ఉన్న ఈ రహదారిపైనే సుమారు 10 గ్రామాలకు చెందిన గిరిజనులు ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ రహదారి మెరుగుపడితే రెండు జిల్లాలకు చెందిన గ్రామాలకు రహదారి కష్టాలు తీరుతాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యపై పంచాయతీ రాజ్ ఏఈ రవితేజ మాట్లాడుతూ మండలంలోని పలుచోట్ల రహదారుల సమస్యపై ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు, ఆదేశాలు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

రెండు జిల్లాలను కలిపే రోడ్డు

రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట వరకు గల ఈ రెండు కిలోమీటర్ల నిడివిగల రహదారి తూర్పు విశాఖ జిల్లాల్లోని దాదాపు పది గిరిజన గ్రామాలను మండల కేంద్రం రాజవొమ్మంగితో అనుసంధానం చేస్తోంది. లోతట్టు గ్రామాలకు వెళ్లే దాదాపు అన్ని రోడ్ల గురించి అధికారులు పట్టించుకుంటున్న కేవలం ఈ రెండు కిలోమీటర్ల రోడ్డును అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఆయా గ్రామాల గిరిజనులు నిత్యం మండల కేంద్రం రాజవొమ్మంగి వెళ్లేందుకు ఈ రహదారే ప్రధానం.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పాలిథిన్ సంచుల్లో విక్రయిస్తే జరిమానా



గుత్తులపుట్టులో వ్యాపారులకు నోటీసులిస్తున్న ఎంపీడీవో దేవిడ్‌రాజు, సర్పంచ్ బాబూరావు పడాల్



జీకే వీధిలోని వారపుసంతలో వ్యాపారులకు నోటీసులిస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది

పాడేరు: పర్యావరణానికి అత్యంత హానీ చేస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరు మానుకోవాలని పాడేరు ఎంపీడీవో డేవిడ్‌రాజు అన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని గుత్తులపుట్టు వారపు సంతలో గురువారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 1 నుంచి పాలిథిన్ కవర్లు నిషేదం అమల్లోకి వస్తుందన్నారు. నార, గుడ్డతో చేసే సంచులు వాడాలన్నారు. వారపు సంతలో ప్రతి దుకాణం వద్దకు వెళ్లి పాలిథిన్ కవర్ల నిషేధంపై నోటీసులు జారీ చేశారు. నిబంధనలను ఎవరైనా ధిక్కరించి పాలిథిన్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ సర్పంచ్ సాగెని బాబూరావు పడాల్, రెవెన్యూ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: కలెక్టర్, జేసీ, పాడేరు ఐటీడీఏ పీఓల ఆదేశాల మేరకు వారపు సంతలు, ఇతర దుకాణాల్లో డిసెంబరు 1నుంచి పూర్తిగా పాలిథిన్ సంచులను నిషేధించినట్టు ఈఓపీఆర్డీ పాపారావు తెలిపారు. మండల కేంద్రంలోని వారపు సంతలో దుకాణాలను ఆయన తిరిగి వ్యాపారులకు పత్రాలను అందించారు. డిసెంబరు 1 నుంచి ఈ నిబంధనలు పక్కాగా అమలు చేస్తామన్నారు. ఎవరైనా రహస్యంగా వ్యాపారులు పాలిథిన్ సంచులు అమ్మినా సరఫరా చేసినా వారిపై భారీ జరిమానా విధిస్తామన్నారు. వ్యాపారులు ప్రత్యామ్నాయంగా నార, గుడ్డ సంచులను విక్రయించుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు , పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



మల్లవరంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శ్రీనువాసరావు

చింతపల్లి: వాయుగుండం హెచ్చరికల నేపథ్యంలో గిరిజన రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సూచించారు. ఆయన గురువారం చింతపల్లి పంచాయతీ పరిధిలోని మల్లవరం, కందులగాది గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. వాతావరణ విభాగ సూచనలు మేరకు రైతాంగం వరి కోతలు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే వరి కోతలు చేపడితే వరి పనలను సురక్షిత ప్రాంతాల్లో కవర్లు కప్పి జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. వరి పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లే విధంగా దారులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రబీ సీజన్‌కు రాజ్‌మా పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద ఇన్సూరెన్సు సౌకర్యం ఉందన్నారు. ఇందులో బీమా సౌకర్యం పొందడానికి రైతులు ఈ-పంటలో నమోదు చేసుకొని ఎకరానికి రూ.300 ప్రీమియం చెల్లించాలన్నారు. పంటల బీమా కోసం రైతులు తమ సమీపంలోని మీ-సేవా కేంద్రం, బ్యాంకులో గాని రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబరు, పంట సాగు ధ్రువీకరణ పత్రం తీసుకువెళ్లి నమోదు చేసుకోవాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న నేచర్ సీఈఓ వికాస్ బాలరాజు

అరకులోయటౌన్: బాల్య వివాహాలు, డ్రగ్స్, సైబర్ నేరాలు తదితర అంశాలపై నేచర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని గురువారం జరిగిన కార్యక్రమంలో నేచర్ స్వచ్ఛంద సంస్థ సీఈవో ఎస్. వికాస్ బాలరాజు మాట్లాడుతూ బాల్య వివాహాలతో ఆరోగ్యం పాడవుతుందని, అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. మేజర్లు అయిన తరువాత వివాహాలు చేసుకోవాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే అడ్డుకోవాలని, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్ మహమ్మారితో జీవితాలు నాశమవుతాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. యువత గంజాయి, సారా, మద్యం వంటి జోలికి వెళ్లొద్దన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్-1930, వివాహాల హెల్ప్‌లైన్ నంబర్- 1098కి సంప్రదించాలన్నారు. నేచర్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నేతలు

జి.మాడుగుల: మండల కేంద్రంలో సీపీఎం నాయకుల ప్రత్యేక సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ మండల కార్యదర్శి సాగిన ధర్మన్నపడాల్ మాట్లాడుతూ పార్టీ జిల్లా మొదటి మహాసభ డిసెంబర్ 4, 5 తేదీల్లో పాడేరు జరగనున్నట్టు చెప్పారు. గడిచిన మూడు సంవత్సరాల్లో జరిగిన ఉద్యమాలు, పోరాటాలు, వాటి ఫలితాలను ఈ మహాసభల్లో చర్చిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కాఫీ రైతులకు బకాయి సొమ్ముల చెల్లింపు, గిట్టుబాటు ధరలు, ఆదివాసీల ఇళ్ల నిర్మాణాలు, గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సభల్లో చర్చించనున్నట్టు తెలిపారు. అనంతరం మహాసభ గోడపత్రికను విడుదల చేశారు. పార్టీ శ్రేణులు పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు దీనబంధు, సన్యాసిదొర, ధనియేల్, భాను తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు డ్రోన్లతో నిఘా



డ్రోన్‌తో నిఘా చేస్తున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ: గిరిజన గ్రామాల్లో గంజాయి సాగు నియంత్రణకు డ్రోన్లతో పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు అరకులోయ సీఐ హిమగిరి ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో డ్రోన్‌లతో విస్తృతంగా సర్వేను గురువారం నిర్వహించారు. మండలంలోని అమలగుడ, బీజుమరవలస, కింజేరు, వసబంద గ్రామాల్లో డ్రోన్‌లతో సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ హిమగిరి మాట్లాడుతూ అరకు సర్కిల్ పరిధి గిరిజన గ్రామాల్లో గంజాయి నిర్మూలనే లక్ష్యమన్నారు. ఈ మేరకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘాను ఏర్పాటుచేశామన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామల సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అటవీ, రెవెన్యూశాఖాధికారులు, మహిళా పోలీసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సభల అనుమతి కోసం వినతి

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ఏపీ టూరిజం గోష్టి అతిథి గృహంలో డిసెంబర్ 1న యూటీఎఫ్ జిల్లా మహ సభ నిర్వహిస్తున్నట్టు ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు చెప్పారు. సభల నిర్వహణకు అనుమతుల కోసం పోలీసులను కలిశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావుతో పాటు నాయకులు అరకులోయ ఎస్‌ఐ గోపాలరావును కలిసి సభ నిర్వహణ కోసం వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఐను కలిసిన వారిలో నాయకులు నారాయణరావు, చిట్టిబాబు, దేముడు తదితరులున్నారు.

మెనూ అమలు తప్పనిసరి



జెడ్పీ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

పెదబయలు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల హాజర పట్టికను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాఠశాలలో విద్యాబోధనలో నాణ్యత ప్రమాణాలపై విద్యార్థులను ప్రశ్నించి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థుల మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనాలు అందించాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండబాబు, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా సర్వే నమోదు చేయాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీవో కుమార్

చింతపల్లి: పంచాయతీలో వివరాల నమోదు, అప్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్ అన్నారు. మండలంలోనితాజంగి, లంబసింగి గ్రామ సచివాలయాలను ఎంపీడీవో శ్రీనివాసరావుతో కలసి ఆయన సందర్శించారు. సచివాలయాలలో స్వర్ణ పంచాయతీ డేటా నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ఎన్‌పీసీఐ బ్యాంకు లింకేజి, హౌస్ హోల్డ్ జియో టాగింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి సూచనలిచ్చారు. ఆధార్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం పర్యాటక సీజన్ కావడంతో ఆయా పంచాయతీల్లో పర్యాటకులు తాకిడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పారిశుద్య మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, అప్పలరాజు సచివాలయం సిబ్బంది ఉన్నారు.

నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు పునరుద్ధరణకు చర్యలు



జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: గత కొంత కాలంగా నిలిచిపోయిన జి.మాడుగుల-విశాఖపట్నం ఆర్టీసీ నైట్‌హాల్ట్ బస్సు సరీ్వసును త్వరలోనే పునరుద్ధరించేందుకు ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారని జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపట్టు, చింతపల్లి, పాడేరు మండలాల గ్రామస్తులు విశాఖపట్నం వెళ్లి పనులు చేసుకొని మరలా రాత్రికి ఇళ్లకు రావటానికి ప్రయాణం ఎంతో సౌకర్యవంతంగా ఉండేదని, నైట్‌హాల్ట్ బస్సును నిలిపివేయడం వలన గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను ఆర్టీసీ అధికారులకు వివరించినట్టు తెలిపారు. నైట్‌హాల్ట్ బస్సు లేకపోవటం వలన గ్రామస్తులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారని, ఆర్థికంగా భారం పడుతుందన్నారు. ఈ ప్రాంత ప్రయాణికుల ఇబ్బందులు, సమస్యలను పరిగణలోనికి తీసుకొని విశాఖపట్నం-జి.మాడుగుల నైట్‌హాల్ట్ బస్సును మళ్లీ పునరుద్దరిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇవ్వడంతో వారం రోజుల్లోనే బస్సు తిరుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో గిరిజన ప్రాంత ప్రజలకు రవాణా సదుపాయం అందుబాటులోనికి రానుంది.

నీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు



రామకృష్ణ, తహసీల్దార్

గూడెంకొత్తవీధి: గుమ్మిరేవుల, చెక్కలమద్ది నీటి సంఘాలకు త్వరలో ఎన్నికల నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు రామకృష్ణ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అధికారులను నియమించి వారికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ, పరిశీలన, ఉపసంహరణ ఎన్నిక జరిగే తేదీలు త్వరలో ప్రకటిస్తామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఒకటే నామినేషన్ దాఖలైతే ఎన్నిక ఏకగ్రీవమవుతుందన్నారు. ఒకటి కంటే ఎక్కువ వస్తే సంఘం సభ్యులతో చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు.

పశువుల పెంపకంతో లాభాలు



రైతులతో మాట్లాడుతున్న పశు సంవర్ధశాఖాధికారి డాక్టర్ రాజీవ్ కిశోర్

పాడేరు : మేకలు, గొర్రెలు, నాటుకోళ్ల పెంపకం ఎంతో లాభదాయకంగా ఉంటుందని గిరిజన రైతులు వాటిపై దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాజీవ్ కిశోర్ సూచించారు. ఆయన తన సిబ్బందితో కలిసి గుత్తులపుట్టు వారపు సంతను గురువారం సందర్శించారు. గిరిజన రైతులకు మేకలు, గొర్రెలు, కోళ్ల పశువుల వ్యాపారంలో వచ్చే లాభనష్టాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరలను అడిగి తెలుసుకున్నారు. ధరలు ఆశాజనకంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. సిబ్బంది సురేష్, ప్రశాంత్, రమణ, కొండబాబు ఉన్నారు.

ఎంఈవో దృష్టికి పాఠశాల సమస్య



ఎంఈవో సుందర్‌రావును కలిసిన ఏకలవ్య ప్రిన్సిపాల్, సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల త్వరితగతన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకొని త్వరగా ప్రారంభించేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుమన్‌కుమార్‌సింగ్ గురువారం ఎంఈవో శెట్టి సుందర్‌రావును కోరారు.

ఈ సందర్భంగా డుంబ్రిగుడలోని ఎంఈవో కార్యాలయంలో ఆయన కలిసి మాట్లాడారు. దీనిపై స్పందించిన ఎంఈవోశెట్టి సుందర్‌రావు మాట్లాడుతూ పాఠశాల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రిన్సిపాల్ సుమన్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలలో మెరుగైన విద్యను నైపుణ్యత గల ఉపాధ్యాయ సిబ్బంది బోధిస్తున్నారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సి.మురుగేష్, పాఠశాల చైర్మన్ కామేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ముంచంగిపుట్టు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార నేపథ్యంలో భాగంగా యూటీఎఫ్ సభ్యురాలు, ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి మండలంలోని జోలాపుట్టు, లబ్బూరు, పనసపుట్టు ప్రాంతాల్లోని పాఠశాలల్లో గురువారం ప్రచారం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాడుతానని, తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాజు, గోపి, పుండరీ, దయానిధి, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



రాజవొమ్మంగిలో పూజలు చేస్తున్న తణుకు వెంకట్రామయ్య దంపతులు, భక్తులు

రాజవొమ్మంగి: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలని అడ్డతీగల పవనగిరి క్షేత్ర వ్యవస్థాపకుడు తణుకు వెంకట్రామయ్య అన్నారు. మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయాన్ని ఆయన తన సతీమణి విజయలక్ష్మితో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. తల్లిదండ్రులు, గురువులు దైవంతో సమానమని, వారిని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా షిర్డీ సాయిబాబాతో పాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వస్త్రదానం కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చిన ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు

ప్రభుత్వ భూములపై సర్వే



కొలతలు తీస్తున్న రెవెన్యూ అధికారులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ భూమి ఆక్రమణ, నిర్మాణాలపై గురువారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ముంచంగిపుట్టు నాలుగు రోడ్ల కూడలి నుంచి రెండు కిలోమీటర్ల మేరు బాపన్నపుట్టు, కించాయిపుట్టు, పెద్దపుట్టు, మినుములపుట్టు మార్గాల్లో 15అడుగుల మేర ఆర్‌అండ్‌బీ భూమి ఎంత మేరకు ఉంది, నిర్మాణాలు జరిగినవి, ఖాళీగా ఉన్న స్థలంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్‌వో రమేష్ ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు, సర్వేయర్లు గొలుసు కొలతలు తీస్తూ, వివరాలు సేకరించారు. రహదారి విస్తరణ జరగుతుందని, ఇళ్లు, షాపులు కూల్చే అవకాశాలున్నాయని వ్యాపారులు, దుకాణ ,ఇంటి యాజమాన్యులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై తహసీల్దార్ నర్సమ్మ మాట్లాడుతూ కేవలం ఆర్‌అండ్‌బీ భూమి రహదారికి ఇరువైపులా ఎంత ఉందనే విషయంపై సర్వే మాత్రమే చేశామన్నారు.